RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:82 | మార్చి 10, 2026 | వెల: రూ.3-00



**ఏసీబీ వలలో ఎస్ఐలు**

2లో




- రాజకీయ అండదండలు.. అధికారుల ఆశీస్సులతో దందా
- సర్కారు ఖజానాకు భారీ గండి
- చర్యలకు ఉపక్రమించిన ప్రతిసారీ కోర్టు స్టేలు
- రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించినా ఫలితం శూన్యం
- డిఫాల్టర్ల ఆస్తుల జప్తుకు సర్కార్ సిద్ధం
- శాశ్వతంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా యోచన

2లో

# వేల కోట్ల సీఎంఆర్ స్కామ్.. అసలు కథ!

**రికార్డుల్లో ధాన్యం.. మిల్లుల్లో శూన్యం**

**వందల క్వింటాళ్లు బొక్కేసిన మిల్లర్ మాయగాళ్లు**

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

రాష్ట్రంలో రైస్ మిల్లర్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ దందా ఇప్పుడు పెను సంచలనంగా మారింది. పేదవాడి ఆకలి తీర్చాల్సిన బియ్యం, కొందరు అవినీతి మిల్లర్ల సొంత వ్యాపార సామ్రాజ్యాలకు పెట్టుబడిగా మారుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు కనిపిస్తుంటే, క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లిన అధికారులకు మాత్రం ఖాళీ గోదాములే దర్శనమిస్తున్నాయి. దాదాపు రూ. 5వేల కోట్ల నుంచి రూ. 8వేల కోట్ల ప్రజాధనం మిల్లర్ల జేబుల్లోకి వెళ్లినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయ అండదండలు, అధికారుల ఆశీస్సులతో ఏళ్ల తరబడి సాగుతున్న ఈ దందాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఇప్పుడు ఉక్కుపాదం మోపుతోంది. చర్యలకు దిగిన ప్రతిసారీ కోర్టు స్టేలతో కాలయాపన చేస్తున్న డిఫాల్టర్లపై ఈసారి రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగిస్తూ, వారి ఆస్తులను జప్తు చేసేందుకు సర్కార్ సిద్ధమైంది. అక్రమార్కులను శాశ్వతంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, ఒక్క గింజ కూడా దక్కకుండా చేయాలనే యోచనతో పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు తీసుకుంటోంది.

## బీజేపీతోనే నగరాభివృద్ధి



- వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక నజర్
- అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కి నిధులు కేటాయించడం అభినందనీయం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

2లో

## రూ.3.18 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



- శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత
- హనోయ్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల అరెస్ట్
- కస్టమ్స్ అధికారుల అప్రమత్తతతో పట్టుబడిన స్మగ్లర్స్

2లో

## టార్గెట్ ఒలింపిక్స్

- క్రీడాకారులకు అందుకు వీలుగా స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు
- క్రీడా శాఖకు సంబంధించి ఉన్నత స్థాయి సమీక్ష



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా, ఒలంపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా క్రీడా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై క్రీడా శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, క్రీడాకారులకు శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కిషోర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం | మార్చి 10, 2026

## ఏసీబీ వలలో ఎస్ఐలు

- బాధితుడి ఫిర్యాదుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- ఎల్బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్‌లో ఇద్దరు ఉప పరిశీలకులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఎల్బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న బాబునాయక్, ప్రమోద్ అనే ఎస్ఐలు లక్ష రూపాయల లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం ఒక నిందితుడికి నోటీసులు జారీ చేసే విషయంలో ఫిర్యాదుదారుడి నుంచి ఈ ఇద్దరు అధికారులు రూ.1 లక్ష లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు దీనిపై అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించడంతో అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్ని ఎస్ఐలను పట్టుకున్నారు. బాధితుడు అందజేసిన సమాచారంతో ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి లంచం స్వీకరిస్తున్న సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన నగదును స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ సేవల్లో అవినీతికి తావు ఉండదని, ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

## రూ.3.18 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

- శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత
- హనోయి నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల అరెస్ట్
- కస్టమ్స్ అధికారుల అప్రమత్తతతో పట్టుబడిన స్మగ్లర్స్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా గంజాయిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ప్రత్యేక సమాచారంతో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఇద్దరు ప్రయాణికుల వద్ద నుంచి రూ.3.18 కోట్ల విలువైన మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం హనోయి నుంచి కౌలాలంపూర్ మార్గంగా ఎయిర్ ఆసియా విమానంలో హైదరాబాద్ చేరుకున్న ఇద్దరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు అనుమానంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి సామాన్లలో దాచిన గంజాయిని గుర్తించారు. మొత్తం 9.10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.3.18 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులను అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు విమానాశ్రయంలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## రాజ్యసభకు వేం ఏకగ్రీవ ఎన్నిక

- ధృవపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి
- తెలంగాణ సమస్యలు ఢిల్లీలో ప్రస్తావిస్తా: నరేందర్ రెడ్డి
- పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన నరేందర్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో గట్టిగా వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వారికి ధృవపత్రాలను అందజేశారు. ధృవపత్రం అందుకున్న అనంతరం వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభలో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి అంశాలు మరియు ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## వేల కోట్ల సీఎంఆర్ స్కామ్.. అసలు కథ!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

రాష్ట్రంలో రైస్ మిల్లర్ల సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) దందా ఇప్పుడు పౌరసరఫరాల శాఖకు పెను సవాలుగా మారింది. రైతుల నుంచి సేకరించిన ప్రతి గింజా ప్రజల ఆకలి తీర్చాలని ప్రభుత్వం భావిస్తుంటే, కొందరు మిల్లర్లు మాత్రం ఆ ధాన్యాన్ని తమ సొంత వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించుకోవడానికి పెట్టుబడిగా వాడుకుంటున్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు, తనిఖీల్లో బయట పడుతున్న ఖాళీ గోదాములు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి.




### అసలు దందా ఎలా సాగుతోంది?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు అప్పగిస్తుంది. దీనినే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యాన్ని మిల్లర్లు నిర్ణీత గడువులోగా తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే, చాలామంది మిల్లర్లు ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండానే బయట మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు పాత రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, దానిని పాలిష్ పట్టించి కొత్త బియ్యంగా ప్రభుత్వానికి అంటగడుతూ రీసైక్లింగ్ మాఫియాను నడిపిస్తున్నారు.

### వేల కోట్ల ప్రజాధనం మాయం

గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,800 మందికి పైగా మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అప్పగించడంలో విఫలమయ్యారు. గత ఐదేళ్లుగా పేరుకుపోయిన సీఎంఆర్ బకాయిలు సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నట్లు అంచనా. దీని విలువ మార్కెట్ ధరల ప్రకారం దాదాపు రూ.5వేల కోట్ల నుంచి రూ.8వేల కోట్ల వరకు ఉంటుంది. వందలాది మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేసిన అధికారులకు స్టాక్ ఉండాల్సిన చోట గాలి కనిపిస్తుండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఈ భారీ సొమ్ము మిల్లర్ల జేబుల్లోకి వెళ్లినట్లు స్పష్టమవుతోంది.

### రాజకీయ అండ.. కోర్టు స్టేలు

ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిన ప్రతిసారీ మిల్లర్లు తమ పరపతిని వాడుతున్నారు. తనిఖీలు జరుగుతున్నప్పుడు అధికారులను లోబర్చుకోవడం, సాధ్యపడకపోతే రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తేవడం వీరి మొదటి ఎత్తుగడ. ఒకవేళ ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తే, వెంటనే కోర్టులకు వెళ్లి సాంకేతిక కారణాలతో స్టేలు తీసుకువచ్చి కాలయాపన చేస్తున్నారు. మరికొందరు తమ మిల్లులను నష్టాల్లో ఉన్నట్లు చూపిస్తూ ధాన్యం కొనుగోలు సమయంలో సిండికేట్‌గా మారి, మేము ధాన్యం సేకరించము అంటూ ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి చేరుకున్నారు.

### ప్రభుత్వ కఠిన నిబంధనలు

ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈసారి బ్యాంక్ గ్యారెంటీ నిబంధనను కఠినతరం చేసింది. గతంలో కేవలం ఒప్పంద పత్రాలపై ధాన్యం ఇచ్చేవారు. కానీ ఇప్పుడు, ధాన్యం కావాలంటే మిల్లర్లు కచ్చితంగా 25శాతం నుంచి 100శాతం వరకు బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాలని నిబంధన విధించింది. బకాయిలు ఉన్న మిల్లర్లను డిఫాల్టర్ల జాబితాలో చేర్చి, వారికి ఈ విడత ఒక్క గింజ కూడా ఇవ్వకూడదని పౌరసరఫరాల శాఖ కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

### ఆర్ఆర్ యాక్ట్ కింద ఆస్తుల జప్తు!

**రికార్డుల్లో ధాన్యం.. మిల్లుల్లో శూన్యం**

**వందల క్వింటాళ్లు బొక్కేసిన మిల్లర్ మాయగాళ్లు**

- రాజకీయ అండదండలు.. అధికారుల ఆశీస్సులతో దందా
- సర్కారు ఖజానాకు భారీ గండి
- చర్యలకు ఉపక్రమించిన ప్రతిసారీ కోర్టు స్టేలు
- రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించినా ఫలితం శూన్యం
- డిఫాల్టర్ల ఆస్తుల జప్తుకు సర్కార్ సిద్ధం
- శాశ్వతంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా యోచన

డిఫాల్టర్లపై ప్రభుత్వం ఇప్పుడు రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ప్రయోగిస్తోంది. బకాయిలు కట్టని వారి మిల్లులను సీజ్ చేయడమే కాకుండా, వారి వ్యక్తిగత ఆస్తులను కూడా వేలం వేసి ప్రభుత్వ సొమ్మును రాబట్టాలని నిర్ణయించింది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారిని శాశ్వతంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని యోచిస్తోంది. ముఖ్యంగా సీఎం బియ్యాన్ని మాయం చేసిన వారిపై కఠినమైన నిఘా పెట్టింది.

## ఎస్ఐగా మొదలైన సేవ.. సీఐగా కొనసాగిన బందోబస్తు

**గీసుగొండ జాతరలో సీఐ డి. విశ్వేశ్వర్ ప్రత్యేక సేవలు**

- భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించిన పోలీసులు
- ట్రాఫిక్, భద్రతపై కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పోలీసుల సేవలకు భక్తులు, స్థానికుల ప్రశంసలు

**వేద న్యూస్, గీసుకొండ**



వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలంలో జరుగుతున్న కొమ్ముల లక్ష్మీనరసింహస్వామి జాతర భక్తుల సందడిలో ప్రశాంతంగా కొనసాగుతోంది. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ జాతరలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గీసుగొండ సీఐగా విధులు నిర్వహిస్తున్న డి. విశ్వేశ్వర్ ఈ జాతర భద్రతా ఏర్పాట్లలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఎస్ఐగా పనిచేసిన సమయంలో కూడా జాతర బందోబస్తులో ముఖ్య బాధ్యతలు నిర్వర్తించి భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించారు. ఆ సమయంలో ఆయన చేసిన సేవలను స్థానికులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. కాలక్రమంలో పదోన్నతి పొంది ప్రస్తుతం సీఐగా అదే జాతరలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడం ఆయన సేవా పరంపరను ప్రతిబింబిస్తోంది. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ పోలీసు సిబ్బందిని సమన్వయం చేస్తున్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నిర్వహణ, ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతా పర్యవేక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సీఐ విశ్వేశ్వర్ నాయకత్వంలో గీసుగొండ పోలీసులు చేపట్టిన బందోబస్తును స్థానిక ప్రజలు, భక్తులు అభినందిస్తున్నారు.

## ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- వెలుగుమట్ల బాధితులకు పరామర్శ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**



ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఇళ్లు కోల్పోయి కన్నీరు పెట్టుకుంటున్న మహిళలను చూసి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డల దుఃఖం, వారి కన్నీళ్లు ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడిన కవిత, తాను ఇక్కడకు పర్యాటకురాలిగా రాలేదని స్పష్టం చేశారు. సమస్యకు పరిష్కారం దొరికే వరకు ఇక్కడే ఉండి పోరాడతానని బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత మంత్రులు వెంటనే వెలుగుమట్లకు వచ్చి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం అన్యాయమని కవిత మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల దుఃఖాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. గతంలో కూడా ఇళ్ల కూల్చివేతకు ప్రయత్నాలు జరిగాయని ఆమె పేర్కొన్నారు. ఇళ్లను కూల్చివేసిన ప్రాంతాల్లోనే బాధితులకు తిరిగి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు.

## బీజేపీతోనే నగరాభివృద్ధి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

- వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక నజర్
- అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కి నిధులు కేటాయించడం అభినందనీయం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ భారీగా నిధులు కేటాయిస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. కేంద్ర పథకం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకానికి నిధుల సమీకరణ లో భాగంగా విదేశీ సహాయం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిసి కేంద్రం నిధుల్ని సమీకరించడంతో గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం గ్రేటర్ మున్సిపల్ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద రూ.5257.20 కోట్లతో చేపట్టే పనులకు పాలనా పరమైన అనుమతి మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. కేంద్రం భారీగా నిధులు ఇస్తున్న ఖర్చు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గంట రవికుమార్ అన్నారు. ఇప్పటికే ఎయిర్పోర్టు మంజూరు చేసిన కేంద్రం.. తాజాగా అండర్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేసిందని ఇప్పటికే స్మార్ట్ సిటీ లో భాగంగా అనేక నిధులు ఇచ్చి నగరం రూపురేఖలు మార్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో హామీలు తప్ప అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు. ఓట్ల కోసం ఇచ్చే హామీలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకున్న దాఖలు లేవని దుయ్యబట్టారు. కేంద్రం నిధులు ఇస్తున్న.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. బండ్ పనుల్లో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. గ్రేటర్ వరంగల్ ఇప్పటివరకు అభివృద్ధి చెందిందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అని స్పష్టం చేశారు. వరంగల్లో బిజెపి ఎమ్మెల్యే కానీ ఎంపీ అభ్యర్థి లేకపోయినా కూడా కేంద్రం నిధులు ఇస్తుందని.. అదే అధికారంలో ఉంటే ఇంకేం నిధులు వస్తాయని గంట రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, ప్రత్యేక వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, బిజెపి కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, బైరి నాగరాజు మరియు జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బిజెపి నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు

**వేద న్యూస్,కారేపల్లి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై సింగరేణి మండలంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని కొత్తూరు తండా గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాలు ఒకేసారి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి.



**కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే**

పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా పార్టీలోకి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ చేరికలలో ధరావత్ బిచ్చు మడంపల్లి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సుమన్ నాయక్, బానోతు లక్ష్మ ధరావత్ హీరలాల్, అజ్మీర బాబూలాల్, అమర్ సింగ్, మోహన్, బుక్య రవి, రాజు, రవి, వెంకటేష్, రమేష్, బాబులాల్ మరియు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. పార్టీలోకి వచ్చిన వారందరూ కష్టపడి పని చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కోరారు. "కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త అనే తేడాలు ఉండవని, అందరూ కలిసిమెలిసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని" ఆయన సూచించారు. కార్యకర్తలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ భారీ చేరికలతో కొత్తూరు తండా మరియు పరిసర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర అభినందనీయం

**వేద న్యూస్, మందమర్రి :**



శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు పురుషులతో సమానంగా అత్యంత ధైర్య సాహసాలతో విధులు నిర్వహిస్తున్నారని పట్టణ ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం మహిళా శక్తిని గౌరవిస్తూ, ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ జి నరేష్ ముఖ్య అతిథిగా హాజరై, స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఎన్ సౌజన్య శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మహిళా పోలీసుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రతి మహిళ ఉద్యోగి తన వృత్తిలో రాణ "స్తూనే సమాజం మార్పుకు కృషి చేయాలని సూచించారు. మహిళా సిబ్బందికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మజీద్ ఖాన్, స్టేషన్ రైటర్లు, కానిస్టేబుల్లు, హోంగార్డ్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాగ్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయంపాలన

**వేద న్యూస్, పాపన్నపేట :**



మండల కేంద్రంలో ని నాగ్ సన్ పల్లి పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. డీఈఓ గా అశ్విత, ఎంఈఓ గా తులసిప్రియ, ప్రధానోపాధ్యాయులుగా సాత్విక్, ఉపాధ్యాయులుగా ముస్కాన్ ,వైష్ణవి, లక్ష్మీ దుర్గ, రిషిత, శివాని ,చిత్ర ,సాత్విక్, షో హన్ ,నిశాంత్, గౌడ్ ,మేనక, మరియు అటెండర్ గా హరిప్రసాద్ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు సుధారాణి ,రాజు, శ్రవణ్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ దండెం సుశీల ,చైర్మన్ చంద్రమ్మ లు హాజరైనారు. స్కావెంజర్ సాయమ్మ తల్లిదండ్రులు మానస ,అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనిర్వచనీయం

**వేద న్యూస్, మందమర్రి :**



సమాజ అభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్, సమిష్టి చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వల్లభాపూరపు సూర్యనారాయణ, పున్నమ్మ, ధరణి కోట తిమోతి జ్ఞాపకార్థంగా శ్రీ చైతన్య పాఠశాలలో అట్టహాసంగా మహిళా దినోత్సవమును పురస్కరించుకొని సోమవారం నారీ శక్తి పురస్కారాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకుడు సునార్కర్.రాంబాబు నేతకాని అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో మెంబర్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్,డా.బాలాజీ, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు నల్వాల సమ్మయ్య యాదవ్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పున్నమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ రంగాల చెందిన మహిళలు డాక్టర్ పి.భవాని పల్లె దావఖన మెడికల్ ఆఫీసర్, ఉపాధ్యాయురాలు జి. పుష్పలత, న్యాయవాది వకుల, మహిళ కానిస్టేబుల్ పి.సౌజన్య, కూచిపూడి నృత్య గురువులు కాపూడి వసుధ, గట్టు శ్రావణి, తదితరులు నారీశక్తి పురస్కారాలు అందుకున్నారు. శ్రీ చైతన్య మహిళా ఉపాధ్యాయురాలకు సన్మాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటున్నారని సమాజ కట్టుబాట్ల వల్ల ఒకప్పుడు వంటింటికే పరిమితం అయిన మహిళల్లో డా.బిఆర్అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే వంటి వారు మహిళలలో చైతన్యం నింపారని గుర్తు చేశారు. మొట్టమొదటి మహిళా డాక్టర్ గా విశేష సేవలందించిన డాక్టర్ ఆనందీబాయి జోషి, అంతరిక్ష ప్రయాణం చేసిన కల్పనా చావ్లా, తొలి మహిళా ఐపీఎస్ అధికారిణిగా కిరణ్ బేడీ తదితరులు కూడా మహిళా లోకానికి ఆదర్శప్రాయులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జి సునీత, తిరుమల, హెప్సిబా, సాహిత్య, శిరీష, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో ముగ్గురికి రిమాండ్

**వేద న్యూస్, శాయంపేట:**

దొంగతనం కేసులో కోర్టు వాయిదాలకు సరిగా హాజరుకానందున ముగ్గురికి నాన్ బెయిల బుల్ వారెంట్ 14 రోజుల రిమాండ్ ను పరకాల జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ సాయి శరత్ విధించారు. శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం దొంగతనం కేసుల లో కోర్టు వాయిదాలకు సరిగా రానందున ముగ్గురు కుతాటి సైదులు, నిమ్మల సంతోష్ ,మేకల హరికృష్ణ వీరికి నాన్ బెయిల్ బుల్ వారంట్ ఎక్సెక్యూషన్ చేసి పరకాల కోర్ట్ లో ప్రవేశ పెట్టగా పరకాల పి ఆర్ ఎల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ సాయి శరత్ ముగ్గురు వ్యక్తులను పరకాల సబ్ జైలుకు 14 రోజులు రిమాండ్ తరలించారని ఎస్సై తెలిపారు.

# డాక్టర్ అనితా రెడ్డికి బెస్ట్ ఎంపవర్డ్ ఉమెన్ అవార్డు

**వేద న్యూస్, హనుమకొండ :**

వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ అండ్ అడ్వైజర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, అనురాగ్ సొసైటీ చైర్మన్, సివిల్ సప్లయ్ డిపార్ట్మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ డాక్టర్ కరుకాల అనితా రెడ్డికి బెస్ట్ ఎంపవర్డ్ ఉమెన్-2026 (సాధికారత కలిగిన మహిళ) సర్టిఫికెట్ అవార్డు అందుకున్నారు. వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో పౌండర్ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి అందజేసారు డాక్టర్ అనితా రెడ్డి కన్జుమర్ రైట్స్ అండ్ ఆక్ట్ పై ఎన్నో అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించినందుకు,మోసపోయిన ప్రజలకు చట్ట ప్రకారం సరి అయిన న్యాయము జరిగేలా చేసినందుకు గాను ముఖ్యంగా మహిళా సాధికారతకు పిల్లలకు, మహిళల అభివృద్ధికి పాటు పడుతున్న తీరు, మహిళల లో ధైర్యము నింపుతూ వారిని చైతన్య పరుస్తున్న కార్యక్రమాలు వారికి చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు డాక్టర్ అనితా రెడ్డి ని ఎంపిక చేసామని అన్నారు. వారి సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం డాక్టర్ అనితా రెడ్డి అని పౌండర్ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి అన్నారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అంటే మోసాలను తగ్గించడమేనని అన్నారు. సమాజ సేవ చేయడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని అన్నారు. అది తన బాధ్యత కూడా అన్నారు.మహిళలను చైతన్య పరచడం అంటే సమాజాన్ని చైతన్య పరచడం అన్నారు. బెస్ట్ ఎంపవర్డ్ ఉమెన్- 2026 సర్టిఫికెట్ అవార్డు లభించడం అది మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా రావడం చాలా సంతోషము గా ఉందని దీని స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తానని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.



# మస్జిద్ ముందు ఇండియా గెలుపు సంబరాలు

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



టీ-20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో న్యూజీలాండ్ పై ఇండియా విజయం సాధించిన సందర్భంగా మహబూబాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్ ఆధ్వర్యంలో స్థానిక "మహేబుబియా మస్జిద్" వద్ద ముస్లిం మత పేద్దలు మరియు యువకులతో కలసి త్రివర్ణ పతకాలతో సంబరాలు నిర్వహించి ఒకరికి ఒకరు మిఠాయి తినుపించుకోడం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ ఫరిద్ మాట్లాడుతూ భారత్ గెలుపు సందర్భంగా చాంపియన్స్ మ్యాచ్లో అద్భుత ప్రదర్శన చేసిన భారత జట్టుకు అభినందనలు తేలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ నాయక్ రహిం, ఫజల్, జాకిర్, జాని, గయాజ్, సయిద్,ఇమ్రాన్,సాదిఖ్,ముజ్జు,నయీం, అబిద్, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ ప్లేయర్స్ కి జెర్సీల అందజేత

**- తిరుమల ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో..**

**వేద న్యూస్,చందుర్తి:**

చందుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త,తిరుమల ఫర్టిలైజర్ అధినేత లింగాల మల్లయ్య ఆధ్వర్యంలో చందుర్తి ప్రీమియర్లీగ్ సిపిఎల్-5 మెగా రామ్ క్రికెట్ టీమ్ క్రీడాకారులకు జెర్సీలను సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు గ్రామీణ క్రీడల పై ఆసక్తి చూపుతూ, అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. తిరుమల ఫర్టిలైజర్స్ వారు గత కొన్ని ఏళ్లుగా గ్రామంలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ.. అనేక సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమ్ క్రీడాకారులు సాగర్,సాయి, తిరుపతి, ప్రసాద్,నరేష్ పాల్గొన్నారు.




# పోలీస్ స్టేషన్ లో మహిళా సిబ్బందికి సన్మానం

**వేద న్యూస్, శాయంపేట:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్ కి సిఐ రంజిత్ రావు ,ఎస్సై జక్కుల పరమేశ్వర్ శాలువతో సన్మానం చేసి వారి సేవలను ప్రశంసించారు. పోలీసులు, మహిళలలు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, భద్రత సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటారని సిఐ రంజిత్ రావు అన్నారు .సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు.

# తరగతి గదిలో ఉపాధ్యాయుని గాఢ నిద్ర..!?

**వేద న్యూస్, కోటగిరి :**

తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు నిద్రపోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు ఆ విషయాన్ని మరిచిపోయి గాఢ నిద్రలోకి జారుకున్నాడు. తరగతి గదిలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సమయంలో ఉపాధ్యాయుడు నిద్ర పోవడం గమనార్హం. అధికారులు వెంటనే స్పందించి ఆ ఉపాధ్యాయుని పై తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 10, 2026

# అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

## – అఖిల భారత యువజన సమాఖ్య మండల కార్యదర్శి మహేష్

**వేద న్యూస్,బెజ్జంకి:**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్డుకు ఆనుకొని పార్కింగ్ స్థలం లేకుండా జరిగిన, జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి కి అఖిల భారత యువజన సమాఖ్య ఏ ఐ వై ఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి నుండి గుండారం, కళ్లేపల్లి, బెజ్జంకి క్రాసింగ్ వెళ్ళే రహదారికి అనుకొని.. గ్రామపంచాయతీ నిర్మాణ నిబంధనలను, అనుమతుల నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ.. రోడ్డుకు ఆనుకొని ఎటువంటి పార్కింగ్ స్థలం లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నిర్మాణాల వల్ల రహదారి వెడల్పు తగ్గిపోవడం,ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడం, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం గా ఉండటమే కాకుండా,గ్రామ పంచాయతీ చట్టాలను, భవన నిర్మాణ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘించడం,.అలాగే దుకాణ దారుల సూచిక బోర్డులు కూడా రోడ్డు మీదనే పెడుతున్నారని పేర్కొన్నారు.




కావున అవసరమైన అనుమతులను, ప్లాన్ లను ధృవీకరించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకొని,భవన నిర్మాణ నియమాలకు అనుగుణంగా సవరింపజేయవలసింది గా అఖిల భారత యువజన సమాఖ్య మండల సమితి పక్షాన తెలిపారు.చర్యలు తీసుకొని యెడల స్థానిక అధికారుల పై సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమం లో ఏ ఐ వై ఎఫ్ నాయకులు రొడ్డ చరణ్,అంతటి సురేష్, తిరుపతి, రాకేష్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది

## – అదనపు ఎస్పీ ఎస్ మహేందర్




**వేద న్యూస్, మెదక్ :**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలోనే కాకుండా దేశ అభివృద్ధిలో కూడా మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, పరిపాలన, రక్షణ, క్రీడలు, సాంకేతిక రంగాలు సహా అన్ని విభాగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది ధైర్యం, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు విశేషంగా సేవలు అందిస్తున్నారని అదనపు ఎస్పీ అభినందించారు. శాంతి భద్రతలను కాపాడడంలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని పరిష్కరించడంలో మహిళా పోలీస్ సిబ్బంది ముందుంటున్నారని అన్నారు. విధుల్లో ఉన్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ మహిళా పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. కుటుంబ బాధ్యతలను నిర్వహించు కుంటూనే విధుల్లో రాణించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయాలను సాధించగలరని చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పుర స్కరించుకుని కేక్ కట్ చేసి మహిళా పోలీస్ సిబ్బందిని షాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఆర్ఐ శైలందర్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, డీపీవో సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- హుస్నాబాద్‌లో సర్పంచులు, అధికారులతో మంత్రి సమీక్ష
- 99 రోజుల కార్యాచరణ అమలుపై చర్చ
- పీఎం సూర్య ఘర్ పథకం ప్రచార వాహనం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**వేద న్యూస్, హుస్నాబాద్ :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై హుస్నాబాద్ మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు సంబంధిత అధికారులతో కలిసి పథకం అమలు తీరును సమీక్షించారు. మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న 99 రోజుల కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చిం చారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అనే అంశాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి సంబంధించిన ప్రచార వాహనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

# విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన

- సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్



**వేద న్యూస్, మెదక్ జిల్లా :**

మెదక్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్ వంటి సమస్యలపై వివరించి విద్యార్థినులను జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ల ద్వారా జరిగే మోసాలు, మ్యాట్రిమోనియల్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే ఇతర మోసాల గురించి ఉదాహరణలతో అవగాహన కల్పించారు. అలాగే సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో వ్యక్తిగత సమాచారాన్ని రహస్యంగా ఉంచుకోవాలని, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలను నమ్మకూడదని, సోషల్ మీడియా ప్రైవసీ సెట్టింగ్స్‌ను సరిగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు భయపడ కుండా వెంటనే స్పందించాలని సూచించారు. అటువంటి సందర్భాల్లో 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినుల సందేహాలను తీర్చి, సైబర్ నేరాల నివారణపై అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా విద్యార్థినులతో కలిసి సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్,సయ్యద్, స్వప్న, కళాశాల సిబ్బంది, సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్రబెల్లి స్వర్ణకి సన్మానం

**వేద న్యూస్, హనుమకొండ:**



తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ చైర్మన్ గా ఎర్రబెల్లి స్వర్ణ నియామకమైన సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణను వారి స్వగృహంలో హనుమ కొండ మరియు వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు బంక సరళ, కే. పార్వత మ్మ ఆధ్వర్యం లో నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఘన సన్మానం...

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ తారాబాయి మాట్లాడుతూ.. మహిళలు సామా జి కంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు చట్టాలు, జీఓలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు ఆత్మ విశ్వాసంతో పాటు, ఆత్మ రక్షణ కోసం కరాటే లాంటి శిక్షణ తీసుకోవాలన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో సగభాగమైన మహిళలు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తే మహిళల సమస్యలు తీరుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బస్వంత్ రావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భారతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధృపతి, వివిధ యూనియన్ల నాయకులు గంగామణి, ప్రేమల, సుధా, స్వాతి, అంగన్ వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామానికి చెందిన కల్లుర్కి పోశెట్టి (57) అను వ్యక్తి ప్రమాదవశాత్తు గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కల్లుర్కి పోశెట్టి అను వ్యక్తి ఈనెల 8 వ తేదీ ఆదివారం రోజున అక్బర్ నగర్ గ్రామంలోని ఎర్రకుంట చెరువు కట్ట వద్ద ఉన్న పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడని, తిరిగి రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల ఎంత వెతికిన ఎక్కడ కూడా కనిపించలేదని, సోమవారం రోజున ఉదయం 8:30 గంటల సమయంలో తమ్ముడు లక్ష్మణ్, చిన్నాన కొడుకు గణేష్ లు పొలం పక్కన ఉన్న ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం కనిపించడంతో, పోలీసులకు సమాచారం అందించారని ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని చెరువు నుండి బయటకు తీయించి మృతదేహాన్ని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుని కొడుకు కల్లుర్కి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# పోతంగల్ తహాశీల్దార్ గా రంజిత్ బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, పోతంగల్ :**




పోతంగల్ మండల నూతన ఎఫ్ఎసి తహ సిల్దార్ గా రంజిత్ సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఇంతకు ముందు రంజిత్ నవీపేట్ నాయబ్ తహసిల్దారుగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు కోటగిరి తహసిల్దార్ గంగాధర్, కోటగిరి తో పాటు పోతంగల్ మండల తహసిల్దార్ గా విధులు నిర్వహించారు. కాగా అదికారులు పోతంగల్ తహసిల్దార్ గా రంజిత్ ను నియమించారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు, వార్డు మెంబర్లకు, మహిళా గ్రామపంచాయతీ సిబ్బందికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాజి పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, ఉప సర్పంచ్ కవిత, గ్రామ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 10, 2026

# ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**- ఎంఈఓ అనురాధ**



**వేద న్యూస్,నల్లబెల్లి :**

పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) అనురాధ సూచించారు. సోమవారం నల్లబెల్లి మండలంలోని నందిగామ ప్రభుత్వ పాఠశాలలో 25 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చెట్టుపల్లి సంజీవరావు సౌజన్యంతో, సర్పంచ్ భూక్యా భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకమని, క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదవీ విరమణ చేసినా విద్యార్థులపై మమకారంతో పరీక్ష సామాగ్రి అందించిన సంజీవరావును ఆమె అభినందించారు. సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ.ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన దుర్గమ్మ- పోచమ్మ జాతర ఉత్సవాలు

**- ఐదు రోజులపాటు భక్తి శ్రద్ధల మధ్య జరిగే వేడుకలు**



**వేద న్యూస్, మెదక్ జిల్లా :**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో దుర్గమ్మ, పోచమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ జాతరలో తొలి రోజే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

**భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ**

జాతర తొలి రోజున గ్రామ ముత్తైదువలు అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఉదయం నుంచే ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు కొత్త కుండల్లో బోనాలను వండి, వాటిని పూలతో అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య భక్తులు భక్తి పరవశంలో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు.

**జాతరకు సర్వాంగ సుందరంగా ఆలయ అలంకరణ**

జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రాత్రివేళల్లో విద్యుత్ కాంతులతో ఆలయం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు క్యూ లైన్లు, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

**నేడు ప్రధాన ఆకర్షణ బండ్ల ఊరేగింపు**

జాతరలో భాగంగా సోమవారం బండ్ల ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిర్వహించనున్నారు. రైతులు తమ ఎడ్ల బండ్లను రంగులు, పూలతో అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగింపుగా ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# వివాహిత అదృశ్యం..కేసు నమోదు





**వేద న్యూస్, కోటగిరి :**

ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన కోటగిరి మండలంలో చోటుచేసుకుంది. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బోడ గంగాధర్ అను వ్యక్తి భార్య బోడ రాజ్యలక్ష్మి అను వివాహిత ఆమె ఇద్దరు పిల్లలైన 6 సంవత్సరాల కుమార్తె స్నితిక, 4 సంవత్సరాల ప్రస్వీత్ లతో కలిసి ఇంట్లో నుండి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో, వివాహిత భర్త బోడ గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ వెల్లడించారు.

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపుష్టికి చర్యలు

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపుష్టికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి లో పారిశుద్ధ్యం పనులు పక్కగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం నగరం శ్రీనివాస నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆర్యోగ కేంద్రం ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోకుండా ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు వైద్యం కు ఉపయోగించిన వ్యర్థాలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో తిరుగుతూ ఓపి సేవలు, ఐపీ సేవలు, డ్రగ్ స్టోర్ రూంలో మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం అందుబాటులో ఉండేలాగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి నేరుగా పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతం నుండి వచ్చినది, వచ్చి ఎంత సమయం అయింది, సమస్య ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నది, గర్భిణిలకు ప్రత్యేక సేవలు, సాధారణ కాన్పులకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐపి ఎంత మంది, ఏఏ వ్యాధులకు ఎక్కువగా వస్తున్నది అడిగారు. ఎంసిహెచ్, ఎన్సీడి, ఇడిడి రిజిస్టర్ లను పరిశీలించారు. వైద్య పరిక్షల సాంపిల్స్ కలెక్షన్స్ గురించి, ఎంత మందికి పరీక్షలు చేసింది అడిగి తెలుసు కున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో నమోదైన గర్భిణులను సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకొనేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర మందులు సరిపోను స్టాక్ ఉండాలని, అవసరమైన మందులకు వెంట వెంటనే ఇండెంట్ పెట్టాలని అన్నారు. మందుల లభ్యత, ఎక్కువగా అవసరమయ్యే మందులు నిల్వ ఉండేలా చూడాలన్నారు. రోగులు మందులు బయట కొనుక్కునే పరిస్థితి రావద్దన్నారు. ఏఎన్ఎం, ఆశాలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొరత లేకుండా చూడాలన్నారు. కావాల్సిన ఏఎన్ఎం, ఆశాల గురించి, వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి, అక్కడ క్రొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందులు, వనరుల కల్పన కు చర్యలు తీసుకోవాలని, పట్టణ ఆరోగ్య కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తే, ప్రజలకు దగ్గర్లో వైద్య సేవలు అందడంతో పాటు, జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగుల తాకిడి తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డా. రామారావు, డిప్యూటీ డిఎంహెచ్వో డా. వేణు మాధవ్, వైద్యాధికారులు డా. సమీరా, డా. సురేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# చైర్మన్ కౌన్సిలర్లకు కనీస విలువ ఇవ్వట్లేదు

**- ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ ఆరోపణ**



**వేద న్యూస్ , జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) కౌన్సిలర్లకు కనీస విలువ ఇవ్వడం లేదని శ్రీపతి స్వర్ణలత నరేష్ ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఓ మీడియా ప్రకటనలో మాట్లాడుతూ.. అధికార పార్టీ కౌన్సిలర్లను కాదని మునిసిపల్ చైర్మన్ తానే ముందుంటున్నారని పేర్కొన్నారు. మంచి పదవిలో ఉన్న చైర్మన్ తన వ్యవహార సరళి మార్చుకోవాలని, లేని యెడల దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# ఓ యువకుని అదృశ్యం



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన 27 సంవత్సరాల పుప్పల సాయిలు అదృష్టమైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పుప్పాల ఓడ్డేయ కొడుకు పుప్పల సాయిలు అనే వ్యక్తి హోటల్ కి వెళ్తానని చెప్పి ఇంట్లో నుండి బయటకు వెళ్ళాడని, కానీ ఇంతవరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి పుప్పాల ఓడ్డేయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

# తుమ్మల కృషి..ఖమ్మంలో సింథటిక్ ట్రాక్

- **రూ.8.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల అథ్లెటిక్ ట్రాక్**
- **పటేల్ స్టేడియంలో శరవేగంగా నిర్మాణ పనులు**
- **పది రోజుల్లో అందుబాటులోకి రానున్న ట్రాక్**
- **జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా సర్దార్ పటేల్ స్టేడియం**
- **ఖమ్మం యువత, క్రీడాకారుల్లో ఆనందోత్సాహాలు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియం త్వరలో అత్యాధునిక క్రీడా సదుపాయాలతో కొత్త రూపుతో క్రీడలకు నూతన వేదిక కానుంది. క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ కల్పించాలనే లక్ష్యంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 8.50 కోట్ల వ్యయంతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ పనులు శరవేగంగా సాగుతుండగా, మరో పది రోజుల్లో పూర్తి చేసుకొని అందుబాటులోకి రానుంది. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యాధునిక సౌకర్యాలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం కొనసాగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఖమ్మం జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జిల్లాలోని స్టేడియాల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణా వేదికలు, ఇతర సౌకర్యాలను సమకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం వల్ల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు లభించనున్నాయి. ఈ ట్రాక్ మన్నికైన, స్థిరమైన, సురక్షితమైన ఉపరితలాన్ని కలిగి ఉండటం వల్ల అథ్లెట్లు వేగవంతమైన సమయాలను సాధించడానికి సహాయపడుతుంది. అలాగే గాయాల ప్రమాదం తగ్గించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో కూడా ఈ ట్రాక్‌పై శిక్షణ కొనసాగించవచ్చు. కనీస నిర్వహణతోనే దీర్ఘకాలం ఉపయోగించుకునేలా ఇది రూపొందించబడింది. సహజ మట్టి ట్రాక్‌తో పోలిస్తే సింథటిక్ ట్రాక్ అథ్లెట్లకు మెరుగైన ఉపరితలం, సౌకర్యం అందిస్తుంది. మట్టి ట్రాక్‌పై సాధన చేసి సింథటిక్ ట్రాక్‌పై పోటీల్లో పాల్గొన్నప్పుడు సుమారు 1.5 నుండి 2 సెకన్ల వరకు తేడా రావడం వల్ల పతకాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. అందువల్ల జిల్లా స్థాయి నుంచే సింథటిక్ ట్రాక్‌పై శిక్షణ చాలా అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్మిస్తున్న ఈ ట్రాక్ వల్ల ఖమ్మం జిల్లా యువతకు అథ్లెటిక్స్‌లో మరింత ప్రోత్సాహం లభించనుంది. ఇప్పటికే సీఎం కప్2024 క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 బంగారు పతకాలు సాధించడం విశేషం. సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందిన ఈ క్రీడాకారుల విజయాలు జిల్లాలో అథ్లెటిక్స్‌కు ఉన్న ప్రతిభను చాటుతున్నాయి. ఇప్పుడు సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే జిల్లాలో మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని క్రీడాభిమానులు భావిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఈ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు క్రీడాభిమానులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వేద న్యూస్, మందమర్రి :**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణా నికి చెందిన చంటి మల్లీశ్వరి రామకృష్ణాపూర్ పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు యాక్సిడెంట్ లో మృతి చెందగా స్థానిక కాలని వాసులు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనతి కాలంలో కాలని వాసులందరితో మమేకమై కలిసిమెలసి ఉన్న వ్యక్తి అకాల మరణంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మానవత్వంతో స్పందించిన స్థానికులు ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ వంతుగా రూ. 30000 నగదు సహాయం ఆమె కూతురికి అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలబడటం మన అందరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఆర్థిక సాయం అందించిన దాతలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో మానవత్వం ఇంకా జీవించి ఉందని ఈ సంఘటన మరోసారి రుజువు చేసిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూం నివాసులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 10, 2026

# ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు బ్యాంకులు తోడ్పాటు అందించాలి

**- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**




ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు బ్యాంకులు తోడ్పాటు అందించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ప్రజ్ఞ సమావేశ మందిరంలో సోమవారం బ్యాంకర్లతో డీసీసీ, డిఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగ రుణాల పంపిణీ, విద్యా రుణాలు, హౌసింగ్ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాల పంపిణీ, పీఎం విశ్వ కర్మ పథకం, పీఎం ఉపాధి కల్పన, ముద్ర పథకాల అమలు, స్వశక్తి మహిళా సంఘాల రుణ పంపిణీ లక్ష్యం వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ బ్యాంకర్లతో చర్చించి పలు సూచనలు చేశారు. మూడవ త్రై మాసికం ముగిసే నాటికి ఆర్బిఐ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ప్రయారిటీ రంగం నందు నిర్దేశించుకున్న రుణ పంపిణీ లక్ష్యంలో 78.53 శాతం చేరుకున్నట్లు తెలిపారు. ప్రయార్టీ రంగ రుణాల పంపిణీ అంశంలో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించని బ్యాంకులు చివరి త్రైమాసికంలో లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రైవేట్ రంగ బ్యాంకులు ప్రయార్టీ సెక్టార్ రుణ లక్ష్యాలు చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 97 కోట్ల రూపాయల విద్య రుణాలు పంపిణీ చేయాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం 22.56 కోట్లు మాత్రమే పంపిణీ చేశామని అన్నారు. యువతకు, విద్యార్థులకు విద్య రుణాల పట్ల అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పంట రుణాల పంపిణీలో బ్యాంకర్లు 74.57 శాతం పురోగతి సాధించారని, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం వ్యవసాయ ఇన్ ఫ్రా రుణాల పంపిణీ కొంత మెరుగుపడి 46.66 శాతానికి చేరుకుందని, చివరి త్రైమాసికం ముగిసే లోపు వీలైనంత మేరకు అగ్రి ఇన్ ఫ్రా రుణాలు అందించాలని అన్నారు. వ్యవసాయ ఇన్ ఫ్రా పెంపుదలకు బ్యాంకులు ఎటువంటి రుణాలు మంజూరు చేస్తాయి, వాటిని ఎలా రైతులు వినియోగించుకోవాలో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఎం.ఎస్.ఎం.ఈ లకు 2025-26 లో 2968.3 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా, డిసెంబర్ చివరి నాటికి 1800.27 కోట్ల రుణం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచే పథకాలపై అవగాహన కల్పించి రుణాలు అందించాలని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి పీఎంఈజీపి క్రింద 211 యూనిట్లను మార్జిన్ మనీ 10 కోట్ల 62 లక్షలతో ఏర్పాటు చేయడం ద్వారా 2321 మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. మెప్మా ద్వారా ఎం.సి.పి. జనరేట్ చేసిన మహిళా సంఘాలకు రుణ పంపిణీ ప్రక్రియ బ్యాంకర్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో స్వశక్తి మహిళా సంఘాల ఎన్.పి.ఏ. 1.89 ఉందని, దీనిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, రుణ రికవరి నోటిసులు జారీ చేయాలని, మొండి బకాయిల వసూళ్లకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పీఎం స్వానిధి క్రింద వీధి వ్యాపారులకు సకాలంలో రుణాల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం సంబంధించి శిక్షణ అందించిన తర్వాత బ్యాంకుల వద్ద పెండింగ్లో ఉన్న 169 అభ్యర్థులకు రుణం అందించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం రవిప్రసాద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మీ, పరిశ్రమల శాఖ ఏడి ఈ. నకుల్ రెడ్డి, డీఎస్సీఓ ఏపీఎం జె. సరస్వతి, ఆర్బీఐ ఎల్డీఓ గోమతి, నాబార్డ్ డీడీఎం సుజీత్ కుమార్, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన ఆరోగ్యం

**- 99వ యాక్షన్ ప్లాన్ పారిశుధ్య పనుల కార్యక్రమం**

**వేద న్యూస్, కారేపల్లి :**



గ్రామస్తుల ఆరోగ్యం, గ్రామాల అందమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు క్షేత్రస్థాయిలో అద్భుతంగా అమలువుతున్నాయి. సోమవారం మండల కేంద్రమైన భజ్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని బొక్కలతండా గ్రామంలో 99వ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం సర్పంచ్ హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ స్వయంగా రంగంలోకి దిగి ఈ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ గ్రామాన్ని శుభ్రం చేయించారు.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

వీధుల వెంబడి ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామస్తులకు వివరించారు. కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా ప్రతి సోమవారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "మన ఊరు - మన ఆరోగ్యం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బొక్కలతండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని హనుమంతరావు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

# 'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి, ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు.. గ్రామ ఉప సర్పంచ్ మోకిడి మారుతి,రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు,ఇతర పరీక్షా సామగ్రినిపంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు రాజశేఖర్, మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరువాల మహేందర్, ఇటిక్యాల హరీష్, ఆవుల మధు, నల్లాల రమేష్, నర్సింగాపూర్ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ నల్లాల బాలరాజు, బూర్గుల అనిల్, నల్లాల సత్తయ్య, నడిగొట్టు శ్రీనివాస్, కొండ శ్రీనివాస్, వెలిశాల లక్ష్మీపతి, ఇరువాల సాయి, మేడారం వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# రసమయి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ధ్వజం

**వేద న్యూస్, బెజ్జంకి :**



బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒగ్గ దామోదర్, మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా ప్రభాకర్ లు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వాక్యాలు "దొంగనే.దొంగ! దొంగ!" అన్నట్లుగా ఉంది అని ఎద్దేవా చేశారు.'ఇథానల్ ఫ్యాక్టరీ పర్మిషన్ల్ ఇచ్చింది మీరు మీ పార్టీ కాదా?. మళ్ళీ నేను ఎమ్మెల్యే గెలిస్తే ఫ్యాక్టరీకి తాళం వేస్తా అన్నావ్ కదా? రసమయి ..ముందు వాళ్ళకి తాళం ఇచ్చిందే నువ్వే కదా? రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గా గెలిచి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేకుండా మోసం చేసి అధికార దాహంతో వేలకోట్ల రూపాయలు సంపాదించినది కాకుండా,ఈ మానకొండూర్ నియోజకవర్గ, బెజ్జంకి మండల ప్రజలను ఇంకా మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేయకు.ఈ బెజ్జంకి మండల ప్రజలకు మీరు ఒక కాలం చెల్లిపోయిన నాణవి మాత్రమే గుర్తుపెట్టుకో! రసమయి' అని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ పార్టీ మనుగడ ఉండదని ఈర్షతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారనీ తెలిపారు. కాంగ్రెస్ పై బురద చల్లే విధంగా వ్యవహారణ తీరు చూస్తుంటే ఈ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారానితెలిపినారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కెరవేణి పోచయ్య, వార్డు మెంబర్లు బోనగం రమేష్,ఎలిగే సతీష్,ఆలయ కమిటీ డైరెక్టర్లు గుబిరే చంద్రం,దోనే శ్యామ్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,సీనియర్ నాయకులు ఐలేని శ్రీనివాస్ రెడ్డి,బోనాల మల్లేశం,నర్సింగరావు, పుర్మ నారాయణ రెడ్డి,కత్తి రమేష్,బండి వేణు, బోనగం శంకర్,గుండని ఎల్లయ్య,సంఘ రమేష్,గుబిరే కిషన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో రెండు ఎస్ఎస్సీ పరీక్షా కేంద్రాలు

**- మొత్తం 376 మంది విద్యార్థులు**

**వేద న్యూస్,నల్లబెల్లి :**




ఈనెల 14వ తారీకు నుండి ఏప్రిల్ 16 తారీకు వరకు నల్లబెల్లి మండలంలో 202526 విద్యా సంవత్సరం నిర్వహించే ఎస్ఎస్సీ పరీక్షలకు మొత్తం 376 మంది విద్యార్థుల నమోదు జరిగిందని ఎంఈఓ అనురాధ తెలిపారు. ఇందుకోసం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.మొదటి పరీక్షా కేంద్రంగా జెడ్పీఎస్ఎస్ నల్లబెల్లి పాఠశాలను ఎంపిక చేశారు. ఈ కేంద్రానికి 136 మంది విద్యార్థులను కేటాయించగా, పరీక్షల నిర్వహణ కోసం 8 మంది పర్యవేక్షకుల (ఇన్విజిలేటర్లు) ను నియమించినట్లు ఆమె పేర్కొన్నారు.రెండవ కేంద్రంగా మండల కేంద్రంలోని కారుణ్య జ్యోతి పాఠశాలను నిర్ణయించారు. ఇక్కడ 240 మంది విద్యార్థులను కేటాయించగా, నిర్వాహణ బాధ్యతల్లో భాగంగా 13 మంది పర్యవేక్షకులు విధులు నిర్వహించ ఉన్నట్లు తెలిపారు.పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా, నిబద్ధతతో పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె సూచించారు.

# ప్రభుత్వ బోరు..ఇంటి బోరుగా మారింది..!?

**వేద న్యూస్, టేక్మాల్ :**



ప్రజలే దేవుళ్ళు ప్రజా సమస్యలే మా సమస్యలు గా భావిస్తాం అంటూ ప్రగల్భాలు పలుకుతూ గద్దెనెక్కి ప్రజా ధనాన్ని సైతం తన ఖాతాలో వేసుకోవడం కొందరు ప్రజా ప్రతినిధులకు అలవాటుగా మారింది. టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో ఓ నాయకుడు నన్ను అడిగే దమ్ము ఎవరికీ ఉందనుకున్నాడో..లేక పంచాయతీ పరిధిలోని ఆస్తులని తనవే అని భావించాడో తెలియదు గాని గ్రామ పంచాయతీకి సంబంధించిన సింగల్ ఫేస్ మోటర్ ను తొలగించి ఏకంగా బోరును సైతం సొంతం చేసుకున్నాడు. మెదక్ జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్ గ్రామ సర్పంచ్ గా కుటుంబ సభ్యులను గెలిపించుకొని ద్విపాత్ర భినయం చేశారు. ఆ సమయంలోనే సింగల్ ఫేస్ మోటర్ గ్రామ ప్రజానీకానికి సరఫరాను తొలగించి తన ఇంటికి సొంతంగా వాడుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఈ బోరును తానే వేయించానని తనకు మాత్రమే హక్కు ఉందని దబాయిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరి హయాంలో వేసిన ఆ బోరు గ్రామస్తులందరిదీ అవుతుందని వారు అంటున్నారు. ఈ ఘటన పై గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ను వివరణ కోరగా అది నేను ఇక్కడికి రాకముందు నుంచే అలాగే కొనసాగుతుందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ప్రతి ఆఫీసు పరిశుభ్రంగా ఉండాలి

**- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**



ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల కార్యక్రమాల అమలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రతి జిల్లా కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడ, ఆయా ప్రాంతాల్లోని జిల్లా కార్యాలయాలు, మున్సిపల్, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వచ్ఛత.. పరిశుభ్రత పనులు పక్కాగా చేయాలని, ఆయా శాఖల అధికారులు, మండల అధికారులు పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో నిరుపయోగ వస్తువులు, చెత్తాచెదారం ఉండకూడదని స్పష్టం చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

# 'టెన్' స్టూడెంట్స్ కి పరీక్ష సామగ్రి పంపిణీ



**వేద న్యూస్,చందుర్తి :**

చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 47 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు శ్రీ లక్ష్మీ గణపతి సూపర్ మార్కెట్ అధినేత కొత్త శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర సమక్షంలో పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్కేళ్లు ఇతర పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఆత్మవిశ్వాసంతో, సమయపాలన పాటిస్తూ, పరీక్షలు రాసి ఈ సంవత్సరం పదవ తరగతి ఎగ్జామ్ లో మన గ్రామం నుండి మండల స్థాయిలో మంచి ఉత్తీర్ణత పొందాలనీ ఆకాంక్షించారు. మండల స్థాయిలో మొదటి ర్యాంకు రెండవ ర్యాంకు మన విద్యార్థులకు రావాలని, ఆశిస్తూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు. పరీక్ష సమయానికి ముందు ఇటువంటి సహాయం విద్యార్థులకు చాలా ప్రోత్సాహకరంగా నిలుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మాందాల అబ్రహం, గ్రామ యువకులు గుంటపల్లి రాజయ్య లోకొజి సతీష్ కుమార్, కృష్ణ, అభి, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 10, 2026

## మహిళలు రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి

**వేద న్యూస్,బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలా సాగర్ గ్రామ పం చాయతీ కార్యాల యంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లా డుతూ.. నేటి ఆధు నిక సమాజం లో మహిళలు, కాలానికనుగుణంగా అన్ని రంగాలలో, ముంద ంకు రావాలని ,ముఖ్యంగా రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి, సాధ్యమవుతుం దని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ రాజు, ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది,అంగన్‌వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,గ్రామంలోని వివిధ మహిళా సంఘ సభ్యుల,ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు,గ్రామ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్ విద్యానికేతన్ విద్యార్థులకు పతకాలు

**వేద న్యూస్,బోయినిపల్లి:**



బోయినిపల్లి మండలానికి చెంది న ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటుతూ.. క్రీడల్లో గొప్ప విజయం సాధించారు. 5వ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్ఫూ, కరాటే, ఛాంపియన్‌షిప్ 2026, లో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్స్,ట్రోఫీలు,సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ బిల్లా ఆనందం అభినందించారు. క్రీడల్లో రాణించి పాఠశాల ప్రతిష్టను, పెంచినందుకు వారికి ప్రత్యేకంగా శు భాకాంక్షలు, తెలిపారు.అలాగే స్కూల్ టీచర్లు, ఇతర విద్యార్థులు, కూడా విజేతలను అభినందిస్తూ. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్న ఈ విద్యార్థులు పాఠశాలకు గర్వకారణంగా నిలిచారనీ తెలిపారు.

# 'బెల్ట్' తీసేనా?

- గ్రామాల్లో జోరుగా షాపులు
- మద్యం మత్తులో యువత
- ఎక్సైజ్ శాఖ అధికారులనిర్లక్ష్యం
- పట్టించుకోరు అని అంటున్న ప్రజలు

**వేద న్యూస్,బోయినిపల్లి;**






రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిని పల్లి మండలం పల్లెలు ఒకప్పుడు పచ్చని పొలాలతో పరస్పర అను బంధాలతో.. సాంప్రదాయ విలు వలతో కళకళలాడేవి. "పల్లెలు పట్టుకొమ్మలాంటివి, దేశా నికి" అని పెద్దలు చెప్పిన మాటలు ఈ నేలలో నాటుకుపోయినవే. కానీ, నేడు అదే పల్లెల్లో "బెల్ట్" షాపుల విస్తరణతో యువత,పెద్దలు, ప్రతి ఒక్కరు, మద్యం మత్తులో,మునిగిపోతుండడం, ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత అధికారుల, పర్యవేక్షణ లేకపోవడం? పరిస్థితిని మరింత విషమం చేస్తోందని గ్రామస్తులు, వాపోతున్నారు.

**గ్రామాల గూడు కట్టిన బెల్ట్ షాపులు**

బోయినిపల్లి మండలంలోని, బూరుగుపల్లి, కోరేం, అనంతపల్లి (మిని వైన్స్)పేరిట పెద్ద వైన్స్ షాప్, నడుస్తున్నాయి. విలాసాగర్,కోదురుపాక, లాంటి, అనేక గ్రామా ల్లో,అనధికారికంగా నడుస్తున్న బెల్ట్ షాపులు, రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒక గ్రామంలోనే పదివరకు బెల్ట్ షాపులు, ఉండటం సాధారణంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. సూర్యోదయం కాకముందే మద్యం అమ్మకాలు మొదలై.. సూర్యాస్తమయందాటినా కొనసాగే దృశ్యాలు, గ్రామాల నిత్యచర్యగా మారిపోయాయి ప్రధాన రహదారుల పక్కన, కాలనీల మధ్యలో, కిరాణా దుకాణాల, వెనుక గదుల్లో బెల్ట్ షాపులు, నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.వీటి మూలన కొంతమంది కుటుంబలలోని, పిల్లలు, పాఠశాలలకు, వెళ్లాల్సిన యువకులు, రోజువారీ కూలి పనులకు, వెళ్లాల్సిన కార్మికులు, మద్యం మత్తులో, గడుపుతుండటం. బాధాకరమని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుటుంబాలపై భారం**

మద్యం వ్యసనం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. సంపాదించిన, దాంట్లో సగానికి పైగా మద్యం కొనుగోలుకే ఖర్చవుతోందని మహిళలు వాపోతున్నారు. రోజువారీ కూలి, సంపాదనతో జీవనంసాగించే కుటుంబాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగామారింది.

కొన్ని కుటుంబాలు అప్పుల బారిన పడగా, మరికొన్ని కుటుంబాల్లో కలహాలు, గృహహింసలుపెరిగాయని గ్రామస్తులు చెబుతున్నారు. చదువుమానేసి చెడు అలవాట్లకు లోనవుతున్న యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఉపాధ్యాయులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు, గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెల్ట్, షాపులపై దాడులు తనిఖీలు జరుగుతున్నాయనే సమాచారం గ్రామస్థులకు అందడం లేదని వారు చెబుతున్నారు. స్థానికంగా ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం ప్రజల్లోనిరాశ కలిగిస్తోంది. గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదంఉందని పెద్దలు హెచ్చరిస్తున్నారు.

**మహిళల ఆవేదన**

గ్రామాల్లోని మహిళలు బాధిత కుటుంబాల సభ్యులు, ప్రభుత్వం వెంటనే స్పందించి బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని, డిమాండ్ చేస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడా వసతులు, అవగాహన కార్యక్రమాలు, కల్పిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వారు సూచిస్తున్నారు.

మద్యం వల్ల నష్టపోయిన కుటుంబాలకు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామంలో ని మహిళలు కోరుతున్నారు.

**చర్యల కోసం ఎదురు చూపు**

పల్లెల్లో ప్రశాంత, వాతావరణం తిరిగి నెలకొనాలని గ్రామస్తులు ఆశిస్తున్నారు. యువత, శక్తిని సృజనాత్మకదిశగా మలిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని గ్రామాలు మళ్లీ పచ్చని, పల్లెలుగా మారాలంటే.. బెల్ట్ షాపుల నిర్మూలనతో పాటు కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలు

- జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

**వేద న్యూస్, కొనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలంలోని కోలనూర్ గ్రామంలో గతంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల విషయంలో భారీ అక్రమాలు జరిగాయని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు.గ్రామస్థుల కథనం ప్రకారం... సుమారు 25 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కాలనీలో నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 150 చదరపు గజాల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అయితే గ్రామంలోని అసలైన నిరుపేదలకు ఈ పట్టాలు అందకుండా, ఇతర గ్రామాల నుండి వలస వచ్చిన వారికి కేటాయించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వలస వచ్చిన వారు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లను నిర్మించి, అనంతరం వాటిని ఇతరులకు అమ్ముకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అంతేకాక ప్రభుత్వం కేటాయించిన 150 చదరపు గజాల స్థలానికి అదనంగా కొంతమంది సుమారు 3 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



**న్యాయం చేయాలని డిమాండ్**

ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాకు గురికాకుండా చూడాలని, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోలనూర్ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. తమ గ్రామానికి న్యాయం చేయాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో వీరబోయిన తిరుపతి, తుడి దేవేందర్ రావు, తాళ్లపెల్లి శేఖర్, సుద్దాల చంద్రయ్య, వీరబోయిన దేవేందర్, వెన్నమనేని సాయి, పెద్ది పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల మధ్య ఘర్షణ!?

**వేద న్యూస్,నసురుల్లాబాద్:**

విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించాల్సిన ఉపాధ్యాయులు బాధ్యతారాహిత్యంగా పాఠశాలలోనే రక్తం వచ్చేదాకా కొట్టుకున్న ఘటన నసురుల్లాబాద్ మండలం బొమ్మన్ దేవ్ పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో చోటు చేసుకుంది.!? కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రొసీడింగ్స్ విషయంలో వ్యక్తిగత కారణాలతో టీచర్స్ మీటింగ్ లో టీచర్లు ఘర్షణకు దిగారని ఎస్.ఐ. రాఘవేంద్ర తెలిపారు.రామోజీ శ్రీనివాస్ కు ముక్కు పై బలమైన గాయమై రక్తం కారడం తో చికిత్స నిమిత్తం నసురుల్లాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. ఉపాధ్యాయుడు నంద్యాల శ్రీనివాస్,హెడ్ మాస్టర్ ఆనంద్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. రాఘవేంద్ర తెలిపారు.

# బీఆర్ఎస్‌లో చేరికలు

**వేద న్యూస్,ముస్తాబాద్:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్, తుర్కపల్లి, రామాలలక్ష్మణపల్లె గ్రామాలకు చెందిన వివిధ కుల సంఘాల అధ్యక్షులు, వార్డ్ సభ్యులు, యూత్ సభ్యులు, మైనార్టీలు భారీ సంఖ్యలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. సిరిసిల్ల లోని పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ గులాబీ కండువాలు కప్పి.. పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, జనగామ శరత్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగు విజయరామరావు, గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల పద్మా రెడ్డి, జవ్వాజి బాలకిషన్, కోటగిరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 4 సార్లు రైతుబంధును ఎగ్గొట్టారు

- ఆరు గ్యారంటీల అమలుకు..
- చట్టబద్ధత కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రాహుల్ బంధు పథకాన్ని రైతులకు ఇచ్చే రైతుబంధు నిధులతో మొదలుపెట్టాడని, సంవత్సరానికి రూ. 1,000 కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కాగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా వేల కోట్ల రూపాయలు పంపించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని, అందుకే రాహుల్ గాంధీ కోసం బ్రహ్మాండమైన ఈ కొత్త పథకాన్ని తెలంగాణలో తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ విమర్శలు చేశారు.రాష్ట్రంలోని రైతన్నలంతా తమకు రైతుబంధు వస్తుందని, కాంగ్రెస్ పార్టీ పెంచి ఇస్తామన్న నిధులను ఇస్తుందని ఎదురు చూస్తూ ఉంటే.. రేవంత్ రెడ్డి రైతుబంధును ఎగ్గొడుతున్నాడని కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికే మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి, ఈసారి కూడా రైతుబంధును ఎగ్గొట్టాడని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా రేవంత్ రెడ్డి తన సీటును కాపాడుకుంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి తన సీఎం పీఠం కాపాడుకోవడానికి ఎప్పటికప్పుడు రాహుల్ గాంధీకి ఆయన కుటుంబానికి అడ్డగోలుగా డబ్బులు పంపుతున్నారని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి సామంతు రాజు లెక్క రాహుల్ గాంధీ ఢిల్లీ గద్దెకు కప్పం కడుతూ ఉన్నారని, అందుకే రాహుల్ కి చెల్లించాల్సిన కప్పం గురించి పేదల భూములు గుంజుకొని, పేదల ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇళ్లను కూలగొట్టి మరి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి ప్రతి ఒక్కరూ తెలంగాణకు వచ్చి 100 రోజుల్లోనే తాము ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను మొదటి క్యాబినెట్ లో నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పించి, అమలు చేస్తామని రాహుల్ గాంధీతో సహా అందరూ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ తెలంగాణ ప్రజలకు బాకీ పడిన ఆరు గ్యారంటీల చట్టంను ఈ సమావేశాల్లో ప్రస్తావిస్తామన్నారు. అందుకే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి, బిల్లు పెట్టి ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు హామీలు అమలు చేసేలా ప్రయత్నం చేస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని, ఎందుకంటే తమ సొంత నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన మాటనే తాము అసెంబ్లీలో చెప్తామన్నారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి రాహుల్ గాంధీతో సహా తమ పార్టీ నేతలు అంతా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేటీఆర్ అన్నారు.

## అధికార దుర్వినియోగంపై కోర్టులో పిటిషన్

- మున్సిపల్ ఎన్నికల్లో..

**వేద న్యూస్ ,మంథని :**



మంథని మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 11వ వార్డులో జరిగిన అధికార దుర్వినియోగంపై పెద్దపల్లి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు 11వ వార్డులో బీఆరెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పుప్పాల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాపెట్టే కార్యక్రమంలో భాగంగా అధికార దుర్వినియోగం చేస్తూ..చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తన ఓటమికి ఓటర్లను ప్రలోభ పెట్టి డబ్బు, మద్యం, చీరలు పంపిణీ చేయడమే కారణమన్నారు. తనకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించినట్లు ఆయన పేర్కొన్నారు.

# వోక్స్ పాప్ పాఠశాల విద్యార్థులకు "ఫైర్" పై అవగాహన

## - ఫైర్ విభాగం ఆధ్వర్యంలో..



**వేద న్యూస్ ,జమ్మికుంట:**

వోక్స్ పాప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఫైర్ సర్వీస్ విభాగం అధికారులు విద్యార్థులకు అవగాహనా సదస్సు ను నిర్వహించారు . ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, రక్షణ పద్ధతుల గురించి విద్యార్థులకు విపులంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి వంటి విషయాలను ప్రాక్టికల్ డెమోతో వివరించారు .ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్, వాక్సాప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ప్రతాప్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమణ రెడ్డి, డైరెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా భద్రతా అంశాలపై మంచి అవగాహన పొందారు. కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులకు స్కూల్ యాజమాన్యం అభినందిస్తూ, ఫైర్ సర్వీస్ విభాగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అపర భద్రాద్రి దేవస్థానంలో అవకతవకలపై ఫిర్యాదు

## - కలెక్టర్, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌కు రామారావు వినతి

**వేద న్యూస్, ఇల్లందకుంట:**




అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంటలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై దేవస్థానం పాలకవర్గం సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్‌తో పాటు వరంగల్ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించింది. దేవస్థానం వ్యవహారాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ.. దేవస్థానానికి శాశ్వత కార్యనిర్వాహణ అధికారిని నియమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం దేవస్థానానికి సంబంధించిన పలు అంశాల్లో పారదర్శకత లేకపోవడంతో భక్తులు, గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.దేవస్థానానికి చెందిన స్థలాలను లీజుకు ఇస్తూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాగే లడ్డు, పులిహోర తయారీ పనులను సంవత్సరాలుగా ఒకే వ్యక్తికి అప్పగించడం వల్ల నాణ్యత లోపించిందని భక్తులు చెబుతున్నారని తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో జరిగే వివాహ కార్యక్రమాలకు సంబంధించి అధికారిక రసీదులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. దీనివల్ల ఆలయ ప్రతిష్ఠ దెబ్బతింటోందని అన్నారు ఇదిలా ఉండగా, దేవస్థానానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ పూర్తిగా కూలిపోయినా పునర్నిర్మాణంపై ఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సుమారు రూ.10 లక్షల వరకు నిధులు వచ్చినప్పటికీ పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన ఆదాయం, తహసీల్దార్ కార్యాలయం నుండి వచ్చిన రూ.11,649 ఆదాయానికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడించడం లేదని తెలిపారు. 202425 సంవత్సరానికి సంబంధించిన మహోత్సవాల హుండీ లెక్కలు కూడా ఇప్పటివరకు భక్తులకు, కమిటీకి తెలియజేయలేదని అన్నారు.దేవస్థానం కమిటీ నిర్ణయాలను పక్కన పెట్టి, కమిటీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇద్దరు అధికారులు వాళ్లదే రాజ్యం అన్నట్టుగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని చైర్మన్ తీవ్రంగా మండిపడ్డారు .ఈ పరిస్థితులు భక్తులకు, గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల దేవస్థానంలో జరుగుతున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, అక్రమాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవస్థానం పాలకవర్గం జిల్లా కలెక్టర్‌తో పాటు వరంగల్ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కోరింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# యూఎస్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' హవా..

**వేద న్యూస్ డెస్క్ :**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ ఎంటర్టైనర్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున టికెట్లు బుక్ చేస్తున్నారు. బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. దీంతో విదేశాల్లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.




ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఓవర్సీస్‌లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ కారణంగా రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి వస్తున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# విజయ్‌రష్మిక జోడీతో మాన్యవర్ వెడ్డింగ్ క్యాంపెయిన్..




**వేద న్యూస్ డెస్క్:**

రానున్న పెళ్లి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఎథ్నిక్ వేర్ బ్రాండ్ మాన్యవర్‌మోహె కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నాతో రూపొందించిన ఈ క్యాంపెయిన్ డిజిటల్ ప్రపంచంలో భారీ స్పందన అందుకుంటోంది. ప్రచార్ కమ్యూనికేషన్ రూపొందించిన ఈ ప్రకటన సోషల్ మీడియా వేదికలపై వైరల్‌గా మారింది. ఆధునిక వివాహ వేడుకల భావోద్వేగాలు, ఆనందాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో ఈ ప్రచార కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ క్యాంపెయిన్ ప్రారంభమైన మూడు రోజుల్లోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా కలిసి కనిపించిన ఒక స్టిల్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. దాదాపు 8 మిలియన్లకు పైగా ఆర్గానిక్ లైక్స్ నమోదయ్యాయి. ఇతర సోషల్ మీడియా వేదికలను కలిపి చూస్తే ఈ ప్రచార కార్యక్రమం ఇప్పటివరకు 300 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించడంతో పాటు 250 మిలియన్ల మంది యూజర్లను చేరుకుంది. పోస్ట్ ఎంగేజ్‌మెంట్ విషయానికి వస్తే 4 లక్షలకు పైగా షేర్లు, 65 వేలకుపైగా రీపోస్టులు, దాదాపు 29,500కు పైగా కామెంట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

# సూర్య 'కరుప్పు' సినిమాపై కొత్త వివాదం..

**వేద న్యూస్ డెస్క్:**

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం "కరుప్పు" చుట్టూ కొత్త వివాదం చెలరేగింది. దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కిస్తున్న ఈ సినిమా విడుదలకు ముందే కొన్ని వివాదాస్పద వార్తలు బయటకు రావడంతో తమిళ సినీ పరిశ్రమలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్నట్లు సమాచారం.అయితే సినిమా విడుదలకు సంబంధించిన అంశాల్లో ఆలస్యం జరుగుతుండటంతో దర్శకుడు మరియు నిర్మాతల మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం దర్శకుడు ఆర్జే బాలాజీ సినిమా నిర్మాతలు, హీరోపై కేసు వేయడానికి సిద్ధమవుతున్నాడని ప్రచారం జరుగుతోంది. సినిమా పూర్తయినా కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కావాలనే విడుదలను ఆలస్యం చేస్తున్నారని దర్శకుడు అసంతృప్తిగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.అంతేకాకుండా పారితోషకం విషయంలో కూడా మేకర్స్ మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ కారణాల వల్లే దర్శకుడు చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నాడని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ వార్తలపై సినిమా నిర్మాతల నుంచి మరో వర్షన్ కూడా వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వారు చెబుతున్నట్లు సమాచారం. దర్శకుడు ఆర్జే బాలాజీతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, కొందరు కావాలనే ఇలాంటి రూమర్లను సృష్టిస్తున్నారని నిర్మాతలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదల విషయంలో త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని కూడా సమాచారం. ప్రస్తుతం విడుదల తేదీపై చర్చలు కొనసాగుతున్నాయని, సరైన సమయం చూసుకుని విడుదల చేయాలని చిత్ర బృందం ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద "కరుప్పు" సినిమాపై వచ్చిన ఈ వివాద వార్తలు తమిళ సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. నిజంగా దర్శకుడు కేసు వేయనున్నాడా లేక ఇవన్నీ కేవలం రూమర్లేనా అన్న విషయం అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073